క్లుప్తంగా

యథేచ్ఛగా రాకపోకలు



తాళ్లపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద పక్కకు ఒరిగిన గడ్డర్లు

నిడదవోలు రూరల్: నిడదవోలు రైల్వేస్టేషన్ వద్ద ఆర్వోబీ నిర్మాణంలో ఉండటంతో తాడేపల్లిగూ డెం వెళ్లే వాహనాలను మండలంలోని తాళ్లపాలెం అండర్‌గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి వద్ద నుంచి దారి మళ్లించారు. దీంతో ఈ వంతెన రోడ్డులో యథేచ్ఛగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన గడ్డర్లను మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో గడ్డర్లు పక్కకు ఒంగిపోయాయి. ఘటనలో ఎటువంటి ప్రాణహాని జరగలేదని, అధికారులు స్పందించి భారీ వాహనాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చాగల్లులో కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చాగల్లులో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్త మాండ్రు దానయ్య కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. దానయ్య భార్య, కుమారులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గంగ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా కమిటీ నాయకులు ఇంటి వీర్రాజు, జాలెం వెంకట్రావు, గెడా శ్యామ్, బొర్రా రజనీ ప్రసాద్, పిండి మంగరాజు, గెడ్డం సురేష్, రమేష్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి దుర్గేష్, తదితరులు

నిడదవోలు: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా ఇస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉండ్రాజవరం మండల కేంద్రంలో ఓ కళ్యాణ మండపంలో మంగళవారం 44 మంది లబ్ధిదారులకు రూ.25.52 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలు మంత్రి దుర్గేష్ పంపిణీ చేశారు. దీనిలో 43 మందికి రూ.21.02 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఒకరికి రూ. 4.50 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను అందించారు.

మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఇకపై సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీని క్యాంపు కార్యాలయం ద్వారా కాకుండా ఉండ్రాజవరం, నిడదవోలు, పెరవలి సహా ఒక్కో మండలంలో ఒక్కోసారి నిర్వహిస్తామన్నారు.

నిషేధం నిర్వీర్యం..!

- యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
- గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు



పంట పొలాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు

చాగల్లు: ప్లాస్టిక్ వస్తువుల (డిస్పోజబుల్) వినియోగం, విక్రయాలపై పూర్తి నిషేధం విధించాం.. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం.. జారిమానా విధిస్తాం అని ఆర్భాటం చేసిన అధికారుల ప్రకటనలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. వస్తువులపై గతంలో అధికారులు వీటి నిర్మూలన చర్యలు చేపట్టినా మళ్లీ కథ కంచికి చేరింది. ప్రస్తుతం నిషేధం ఎక్కడా అమలుకు నోచుకోకపోవడంతో విచ్చలవిడిగా అమ్మకాలు చేపడుతున్నారు. వీటి వినియోగం పర్యావరణ పరిరక్షణకు పెనుభూతంగా మారింది. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మనం చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటుంది. ఉదయం బయట నుంచి టిఫిన్, కూరగాయలు, సరకులు ఇలా అన్నింటికి పాలిథిన్ కవర్లనే వాడుతున్నాం. వీటిని వాడటం వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా వినియోగించటం ఆపట్లేదు. పాలిథిన్ కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినా అది ఎక్కడ అమలు కావడం లేదు. అప్పుడప్పుడు అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలో రోజుకు సుమారు టన్ను..

పాలిథిన్ కవర్లు, వస్తువుల విక్రయాలు మాత్రం నియోజకవర్గంలో కొవ్వూరు మున్సిపాలిటీతో పాటు చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో యథేచ్ఛగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో రోజుకు సుమారు టన్ను వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నట్టు అంచనా. గతంలో గ్రామస్థాయి నుంచి 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్ల విక్రయాలపై నిషేధాన్ని అమలు చేశారు. ప్రతి దుకాణంలో, చికెన్ సెంటర్లలో, బేకరీల్లో, హోటళ్లలో, మద్య షాపుల్లోనూ పాలిథిన్ వాడకాలు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. వాటిని వాడేసి రోడ్లపైన, గ్రామ పరిసర ప్రాంతాల్లో పడేస్తున్నారు. వీటి వల్ల అపరిశుభ్ర వాతవరణం నెలకొంటుంది. పాలిథిన్‌ను ప్రమాదకరమైన పెట్రోకెమికల్స్ వినియోగించి తయారు చేస్తున్నారు.

నీటి మట్టాలు పడిపోయే అవకాశం

పాలిథిన్ కవర్లను ఆవులు, మేకలు, గేదెలు తిని మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. పాలిథిన్ కవర్లు భూమిలో కరగడానికి చాలా సంవత్సరాలు పడుతుందని, దీని వల్ల భూగర్భ జలాలు అడుగంటే అవకాశాలు కూడా ఉండవని పలువురు నిపుణులు చెబుతున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలో అనారోగ్య కారణాల వల్ల మరణించిన ఆవు పొట్టలో 40 కిలోల ప్లాస్టిక్ సంచులు బయటపడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.



ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దృశ్యం

ఆరోగ్యానికి హానికరం

వేడి ఆహార పదార్థాలను (ఫాస్ట్‌ఫుడ్) ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొని వెళ్లటం వల్ల పాలీ ఇథలిన్, పాలీ హిస్టరీస్ వంటి రసాయానాలు కరిగి ఆహార పదార్థాల్లో కలిసిపోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాలిథిన్‌కు బదులు ప్రత్యమ్నాయ వస్తువులు వాడకంపై ప్రజలను చైతన్యవంతులు చేయాలంటున్నారు. అధికారులు స్పందించి పర్యవరణానికి ముప్పు వాటిల్లే పాలిథిన్ విక్రయాలపై తనిఖీలు చేపట్టాలని, పాలిథిన్ వస్తువులు అమ్మేవారిపైనే కాకుండా తయారీ సంస్థలపై కూడా దృష్టి సారించాలని, అప్పుడే నిషేధం సక్రమంగా అమలవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చాగల్లులో గత నెల నుంచి అధికారులు దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాడితే రూ.500 జారిమానా విధిస్తామని ప్రకటించారు. కానీ వాటి విక్రయాలు ఏమాత్రం తగ్గలేదని పలువురు అంటున్నారు.



చాగల్లు మండలంలో వాడి పడేసిన పాలిథిన్ వ్యర్థాలు

వ్యాపారులకు నోటీసులు ఇస్తున్నాం



పాలిథిన్ విక్రయాలు చేస్తున్న వ్యాపారులకు నోటీసులు ఇస్తున్నాం. పాలిథిన్‌కు ప్రత్యమ్నయంగా కాగితం వస్తువులు, గుడ్డ సంచులు వాడాలని ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం.

– శ్రీదేవి, ఎంపీడీవో, చాగల్లు.

పక్కాగా అమలు చేయాలి



పాలిథిన్ నిషేధం పక్కాగా అమలు చేయాలి. వీటిని విక్రయించే వారిపై, 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లను తయారీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. పాలిథిన్ వల్ల పర్యావరణానికి తీవ్రం నష్టం కలుగుతుంది. వీటిని వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలి.

– లకంసాని సూర్యప్రకాశరావు, మాజీ సర్పంచ్, మల్లవరం.

రాజకీయ కక్షతో అక్రమ కేసులు



పెనకనమెట్టలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, గ్రామస్తులు

తాళ్లపూడి (కొవ్వూరు): చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ కక్షతోనే ఎటువంటి ఆధారాలు లేకపోయినా వైఎస్సార్ సీపీ నాయకులపై, ప్రజా ప్రతినిధులపై అక్రమ కేసులు పెడుతుందని ఈ నేపథ్యంలో సోమవారం మద్యం అక్రమ కేసులో మిథున్ రెడ్డికి బెయిల్ రావడమే దానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు మండలం పెనకనమెట్టలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బండి అబ్బులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ గ్రామస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మండల నాయకులు కలిసి గ్రామంలో గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయని విధానంపై రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు.

కూటమివి నిరాధార ఆరోపణలు

సమావేశంలో తలారి వెంకట్రావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం విధానంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అంతా పారదర్శకంగా ఉందన్నారు. అందుకే ఇంత వరకు కూటమి ప్రభుత్వం ఒక్క ఆధారం కూడా చూపలేకపోయిందన్నారు. లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపడానికి విఫలయత్నం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారన్నారు. అందుకే జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేసి కూటమి పాలకులు చేస్తున్న అరాచకాలను ఫిర్యాదు రూపంలో భద్రపరచి ఇబ్బందులు పెట్టిన అధికారులను, పాలకులను మన ప్రభుత్వం వచ్చాక ప్రతి ఒక్కరిని చట్టం ప్రకారం శిక్షిస్తామన్నారు. అన్ని పథకాల్లో కోతలు పెడుతున్నారని ప్రజలు గమనించాలని వచ్చే ఎన్నికల్లో వైఎస్. జగన్మోహన్ రెడ్డిని మరలా సీఎంను చేయాలని అన్ని వర్గాల వారికి అప్పుడే మంచి జరుగుతుందని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బండి అబ్బులు, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా బేగ్, ముఖ్య నాయకులు ముదునూరి నాగరాజు, తోట రామకృష్ణ, చొటుపల్లి వీరన్న, ఉప్పులూరి సూరిబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, గ్రామానికి చెందిన నాయకులు కె.నాగు, ఇ.రామకృష్ణ, పి.మంగరాజు, వెంకటేశ్వరరావు, డి.సతీష్, పి.బ్రహ్మం అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో బ్రెజిల్ ప్రతినిధుల పర్యటన

సీటీఆర్ఐ:(రాజమహేంద్రవరం) జిల్లాలో అక్టోబర్ 4, 5వ తేదీల్లో బ్రెజిల్ ప్రతినిధులు రెండు బృందాలుగా పర్యటిస్తారని, వాటిలో మొత్తం 27 మంది సభ్యులు ఉంటారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వీరి పర్యటనతో మన ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు. మొదటి బృందం అక్టోబర్ 4న పెరవలి మండలం ముక్కామల గ్రామంలో, అక్టోబర్ 5న కొవ్వూరు మండలం కాపవరం, దేవరపల్లి మండలం యర్నగూడెంలో పర్యటిస్తారన్నారు. ఈ బృందానికి సమన్వయ అధికారులుగా జకీర్, మధుమోహన్ వ్యవహరిస్తారని, సాంకేతిక, కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది ఉంటారన్నారు.

- రెండో బృందం అక్టోబర్ 4న కొవ్వూరు మండలం కాపవరం, అక్టోబర్ 5న దేవరపల్లి మండలం కూరుకురు, పల్లంట్ల, యర్నగూడెం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. సమన్వయ అధికారులుగా సుధాకర్, హుమాయూన్ వ్యవహరిస్తారని, అనుబంధ సాంకేతిక బృందం, కమ్యూనికేషన్ విభాగం అధికారులు ఉంటారన్నారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయం చేసుకుని పర్యటన విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు



గొబ్బెమ్మల చుట్టూ నృత్యం చేస్తూ, పాటలు పాడుతున్న మహిళలు, చిన్నారులు

దేవరపల్లి: మండల కేంద్రం స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారి ఆలయం వద్ద దసరా మహోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి బతుకమ్మ పండుగ వైభవంగా నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు బతుకమ్మలకు పూజలు నిర్వహించి గ్రామంలో బతుకమ్మలను ప్రదర్శించి నిమజ్జనం చేశారు.

ప్రతి ఏటా దసరా ఉత్సవాల సందర్భంగా బతుకమ్మ పండుగను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని బతుకమ్మ వేడుకలను తిలకించారు.

కూటమి ద్రోహం..పేదలకు శాపం



బంధపురం సమావేశంలో మాట్లాడుతున్న కూచిపూడి సతీష్, పార్టీ నాయకులు

దేవరపల్లి: కూటమి ప్రభుత్వంలో ప్రజలు అన్నివిధాలుగా మోసపోయారని వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అన్నారు. మండలంలోని బంధపురంలో మంగళవారం రాత్రి గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకర గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు కావస్తున్నప్పటికి అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉందన్నారు. రహదారుల దుస్థితి చూచి ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధి గురించి రోడ్డెక్కి ఆందోళనలు చేసిన కూటమి నాయకులు ఏడాదిన్నార నుంచి ఎందుకు అభివృద్ధి చేయలేదని పాలకులను ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు మొక్కుబడిగా అమలు చేసి పేదలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఉచిత గ్యాస్ పథకం అటకెక్కిందని, విద్యుత్ చార్జీల షాక్ నుంచి ప్రజలు తేరుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు.

కమిటీల ఏర్పాటు

విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఆయా రంగాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి కూటమి ప్రభుత్వం తెరచాటు ప్రయత్నాలు చేస్తోందని దుయ్యాబట్టారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధాలపై ప్రతి మండలంలో 8,000 మంది కార్యకర్తలతో సైన్యం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఆచంట సురేష్ ఎంపీటీసీ సభ్యుడు సొంటి కాశీవిశ్వనాథం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెనుపోతుల సుబ్బారావు, త్యాజంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు కాకర్ల శోభన్ కుమార్, సుంకర రాంబాబు, పలువురు పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాష్టమి పూజలు



కనకదుర్గ అలంకరణలో నిడదవోలు కనకదుర్గ అమ్మవారు దర్శనం



సమిశ్రగూడెం కనకదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పోతవరంలో కామాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దేవరపల్లి బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో లక్షకుంకమార్చన చేస్తున్న మహిళలు

నిడదవోలు: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి, శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు కనకదుర్గ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు దుర్గాష్టమి పూజలు, కుంకుమ పూజలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి వచ్చి దంపతులు సామూహిక కుంకమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు బాదంపూడి సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు. నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, 40 మంది భవానీలు నిత్య పూజులు చేస్తున్నారు. మండలంలోని సమిశ్రగూడెం పశ్చిమడెల్టా ప్రధాన కాలువ ఒడ్డున వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి దుర్గాష్టమి సామూహిక కుంకమ పూజలు చేశారు. అర్చకులు రాగిడిమిల్లి శ్రీరామకృష్ణ, పిప్పళ్ల దుర్గ, గాయత్రీ తదితరులు పాల్గొన్నారు. చింతచెట్టు వీధిలో 32వ శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాటిమీద సెంటర్‌లో భీమడొరతూము సెంటర్లో వేంచేసి ఉన్న దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దుర్గ భవాని దీక్షాపీఠం ఆధ్వర్యంలో దుర్గాష్టమి పూజలు వైభవంగా నిర్వహించారు. దీంతో పట్టణ వ్యాప్తంగా ప్రత్యేక శోభను సంతరించుకుంది.

ఘనంగా శరన్నవరాత్ర సంబరాలు

ఊరువాడా భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్ర సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోపవరం గుబ్బాలమ్మ, సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ, డి.ముప్పవరంలో కొండాలమ్మ, ముత్యాలమ్మ, లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కంసాలి పాలెంలో దేవీపాటెమ్మ అమ్మవార్లను, దుర్గాదేవి విగ్రహాలను సోమవారం ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి విశేష కుంకుమపూజలు జరిపించారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కనక దుర్గాదేవిగా కామాక్షి అమ్మవారు

నల్లజర్ల: దేవి శరన్నవరాత్రలలో భాగంగా అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పోతవరం జమ్మిచెట్టు వద్ద ఉన్న కామాక్షి అమ్మవారి 38వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతపల్లిలో స్వర్ణదుర్గా ఆశ్రమంలో శ్రీచక్ర సమేత కనకదుర్గా అమ్మవారి 85వ వార్షికోత్సవాల సందర్భంగా విజయవాడ సీఐ నల్లజర్ల దుర్గాప్రసాద్, మాధవి దంపతులు కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. నల్లజర్ల రామకృష్ణ భజన బృందం హరినామ సంకీర్తన నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నల్లజర్ల వనదుర్గా ఆలయం, దూబచర్ల, తూర్పుచోడవరం ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం

చాగల్లు: మండల వ్యాప్తంగా దసరా నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగల్లులో మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి దుర్గమ్మ కథ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి కోటి సహస్రనామ పారాయణ నిర్వహించారు. ధనలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని లిల్లీ పుష్పాలతో అలంకరించారు. మీనానగరం ముత్యాలదిబ్బవ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో కుంకమ పూజలు నిర్వహించారు. ఊనగట్లలోని కనకదుర్గమ్మ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బ్రాహ్మణగూడెంలో అమ్మవారికి నాగారమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయం వద్ద తాళ్లపూడి మండలం రావూరుపాడు చెందిన బృందం కనకదుర్గమ్మకథంభా కార్యక్రమం నిర్వహించారు. ఎస్.ముప్పవరం, గరప్పాడు తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కనకదుర్గాదేవి అలంకరణలో తాళ్లపూడి శ్రీచక్ర అమ్మవారు

దుర్గాదేవికి లక్ష కుంకుమార్చన

దేవరపల్లి: దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరణ చేసి భక్తులు కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బాలదుర్గమ్మ, సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారి ఆలయాల్లో మహిళలు లక్ష కుంకమార్చన పూజలు నిర్వహించారు.

కనకదుర్గాదేవిగా శ్రీచక్ర అమ్మవారు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని నవదుర్గాధి పరివార శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో 24వ దసరా మహోత్సవాల్లో భాగంగా 9వ రోజు అమ్మవారికి శ్రీ కనక దుర్గాదేవిగా అలంకరించారు. అర్చకులు సుబ్రమణ్య శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మలకపల్లి, వేగేశ్వరపురంలో మేదర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, బల్లిపాడు శివాలయంలో, గజ్జరం, అన్నదేవరపేట, పైడిమెట్ట, పెద్దేవం, తాడిపూడి తదితర గ్రామాల్లోని భవానీ మాలధారులు అమ్మవార్ల ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



విశేష పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

కోటసత్తెమ్మ సన్నిధి.. భక్తజన పెన్నిధి

నిడదవోలు రూరల్: శరన్నవరాత్రల్లో తొమ్మిదో రోజైన దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని విశేష పుష్పమాలికలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 392 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,00,310 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ చెప్పారు. ప్రధానార్చకులు ఎస్ వీకేఏ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.